క్లుప్తంగా

స్నేహితుల దినోత్సవ సంబరాలు

అన్నదానం చేసిన మిత్ర బృందం



అన్నదానం చేస్తున్న నంబర్‌వన్ పాఠశాల పూర్వ విద్యార్థుల మిత్ర బృందం

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని సాయిపూర్ ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాలలో 1985 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పాఠశాల ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మిత్ర బృందం ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో స్నేహితుల దినోత్సవం రోజున అన్నదాన కార్యక్రమంతో ప్రారంభించామన్నారు. అన్నదానం ఆకలిని తీరిస్తే, అక్షర జ్ఞానం అజ్ఞానాన్ని తొలగిస్తుందని, తాము విద్యనభ్యసించిన పాఠశాల నుంచే సేవా కార్యక్రమాలు మొదలు పెట్టినట్లు చెప్పారు. భవిష్యత్‌లో సైతం మిత్రబృందం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

త్యాగాలకు ప్రతీక మొహర్రం



పీర్ల ఊరేగింపులో భక్తులు

పూడూరు: త్యాగాలకు ప్రతీకగా మొహర్రం నిలుస్తుందని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పూడూరు మండల పరిధిలోని మీర్జాపూర్‌లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలంలకు ప్రత్యేక పార్థనలు చేశారు. పండుగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చన్గోముల్ పోలీసులు బందోబస్తును నిర్వహించారు.

గర్భిణులకు అభినందన

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని బొంరాస్‌పేట–2 అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం తల్లి పాలవారోత్సవాలు జరుపుకున్నారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అనంతరం వారిని అభినందించారు. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్త జోవనజ్యోతి, ఆయా పాల్గొన్నారు.

రక్షా బంధన్‌కు ప్రత్యేక స్థానం

వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజు

అనంతగిరి: భారతదేశం సంస్కృతి, సంప్రదాయలకు నిలయమని, రాఖీ పండుగకు ప్రత్యేక స్థానం ఉందని వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజు పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్షా బంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రాఖీని సంతోషాలతో జరుపుకోవాలన్నారు. అనంతరం బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు రాఖీ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు బందెప్పగౌడ్, బ్రహ్మకుమారీస్ తాండూర్ నిర్వాహకురాలు జగదేవి, కళావతి, గిరిజా, విద్యా, మధు అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని హెచ్‌పీసీఎల్ ఫిల్లింగ్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ వద్ద నిర్వహించనున్న ఈ ఉచిత శిబిరానికి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

మొయినాబాద్‌రూరల్: అన్నదమ్ములుగా కలిసిమెలసి ఉండడంతో పాటు కష్టసుఖాలను పాలుపంచుకున్నప్పుడే స్నేహానికి అర్థం ఉంటుందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ మండల నాయకుడు కుమ్మరి రాము అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఎన్కెపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దాదాపు 40 మంది స్నేహితులందరూ ఏకమై విద్యార్థి దశ నుంచి నేటి వ్యాపార ఉద్యోగాల్లో స్థిరపడి ఉన్న వారంతా కష్టసుఖాలను పాలుపంచుకున్నారు. ఒకరినొకరూ చేస్తున్న ఉద్యోగ, వృత్తి, వ్యాపారాలను, కష్టసుఖాలను తెలియజేశారు. అనంతరం కేక్‌కట్ చేసి తినిపించుకున్నారు. అనంతరం కుమ్మరి రాము మాట్లాడుతూ.. ఎన్కెపల్లిలో చిన్నపెద్దా తారతమ్యం లేకుండా అన్నదమ్ములుగా, స్నేహితులుగా 20 సంవత్సరాల నుంచి అలాగే కొనసాగుతోందన్నారు. కలిసిమెలసి ఉండడంతో కష్టసుఖాల్లో పాలుపంచుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో దానయ్య, సుభాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరివేపాకు సాగు భలే

నేడు వ్యవసాయం అంటే ఖర్చుతో కూడుకున్నది. మార్కెట్‌లో రసాయనిక ఎరువులు, మందులు వంటి వాటి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ తరుణంలో పెట్టుబడి ఖర్చు తగ్గించుకొని అధికాదాయం ఇచ్చే పంటలవైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా కరివేపాకు సాగు లాభదాయకంగా ఉంటుందని పలువురు అన్నదదాలు ఈ పంట వేయడానికి ముందుకొస్తున్నారు.

- ఒక్కసారి పంట వేస్తే ఇరవై ఏళ్లు
- శ్రమ, పెట్టుబడి ఖర్చులు తక్కువ
- ఆసక్తి చూపిస్తున్న అన్నదాతలు



గొల్లగూడలో కరివేపాకు తోట

నవాబుపేట: వ్యవసాయం చేయాలంటే దుక్కి దున్ని, పంట చేతికొచ్చే వరకు ఖర్చులు కూడా ఎక్కువగానే ఉంటాయి. మార్కెట్‌లో రసాయనిక ఎరువులు, మందులు వంటి వాటి ధరలు విపరీతంగానే ఉన్నాయి. దీంతో కొందరు రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం సమకూర్చుకోవడానికి కొన్ని పంటలను పండిస్తున్నారు. అందులో భాగంగా కొందరు కరివేపాకు పంటపై ఆసక్తి చూపిస్తున్నారు. దీన్ని సాగు చేసుకుంటే నీటి వసతి, మందుల వాడకం కూడా తక్కువేనని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ పంట వేస్తే లాభదాయకమని నవాబుపేట రైతులు వివరిస్తున్నారు. ఉద్యాన పంటల్లో ఒకటైన ఈ సాగు పెద్దగా ఎక్కడ కనిపించదు. మండల పరిధిలోని ఎల్లకొండ, లింగంపల్లి, నవాబుపేట, గంగ్యాడ, ముబారక్‌పూర్, అక్నాపూర్, చించల్‌పేట, తదితర గ్రామాల్లో ప్రస్తుతం 50ఎకరాల వరకు సాగవుతుంది.

ఉద్యాన పంటగా..

ఉద్యాన పంటలు కేవలం ఆరు నెలలు, రెండు నెలలు, 40 రోజులు ఉంటాయి. పంట కాలం పూర్తయిన వెంటనే వేరే పంటలు వేస్తారు. కానీ కరివేపాకు పంట ఒక్క సారి విత్తితే అది 20 ఏళ్ల వరకు దిగుబడి ఇస్తుంది. అవసరం మేరకు మందులు, నీళ్లు పెడితే చాలు పంట కోతకు తయారవుతుంది. అన్ని పంటల్లా ప్రతీయేడాది విత్తనం విత్తే అవసరం ఉండదు. రైతుకు కూడా పొలాన్ని మళ్లీ మళ్లీ దున్నే అవసరం రాదు.

గుంటూరు, విజయవాడలో లభ్యం

ఇవి ఎక్కడపడితే అక్కడ లభ్యం కావు. అవి కేవలం గుంటూరు, విజయవాడలో మాత్రమే లభిస్తాయి. అక్కడ వ్యాపారులు కరివేపాకు చెట్ల నుంచి కాయలను అప్పుడే తీసుకొచ్చి మార్కెట్‌లో విక్రయిస్తారు. చెట్ల నుంచి తీసిన విత్తనాన్ని మూడు రోజుల్లో పొలంలో విత్తాలి. లేనిచో అవీ మొలకెత్తవని పేర్కొంటున్నారు. కాబట్టి ముందే పొలాన్ని సిద్ధం చేసుకోవాలి.

విత్తనాల ధర కాస్త ఎక్కువే

కరివేపాకు విత్తనాల ధర అధికంగానే ఉంటుంది. కిలో రూ.80 నుంచి 100 వరకు పలుకుతుంది. ఒక ఎకరం సాగు చేయడానికి 3 క్వింటాళ్ల వరకు అవసరమవుతాయి. విత్తనాలు, ఎరువులు కలిపి ఎకరం సాగు చేయడాకి సుమారు రూ.50వేల వరకు ఖర్చవుతుంది.

ఏడాదిలో మూడు సార్లు

కరివేపాకు వేసి మొదటి ఏడాది 6 నెలలు కోతకు వస్తుంది. అనంతరం అదే ఏడాదిలో 3 కోతలు దిగుబడి వస్తుంది. సుమారుగా కోతకు రూ.50 నుంచి 70వేల వరకు లాభాలు పొందొచ్చని రైతులు పేర్కొంటున్నారు.

నీటి వాడకం తక్కువే

వర్షా కాలం మొదలు సుమారు 6 నెలలు రైతులు నీళ్లు పెట్టాల్సిన అవసరం ఉండదు. కరివేపాకు ఏర్లు భూమిలోపలికి పీట్‌కుపైగా వెళ్తాయి. దాంతో ఒక్క సారి వర్షం పడితే సుమారు 25 రోజుల వరకు నీటి అవసరం ఉండదు. దాంతో రైతులకు నీరు పెట్టే శ్రమ ఉండదు.

రెండెకరాల్లో..



ప్రస్తుతం రెండెకరాల్లో సాగు చేస్తున్నాను. ఈ పంటకోసం కొంచె కష్టపడితే చాలు. దీనికోసం కేవలం కలుపు, చీడపీడల మందు, నీళ్లు అవసరమవుతాయి. శ్రమిస్తే మంచి లాభాలే మిగులుతాయి.

– అంజి, రైతు, గొల్లగూడ

నేరుగా అమ్ముకుంటా



పదిహేను సంవత్సరాల నుంచి ఎకరం పొలంలో కరివేపాకు సాగు చేస్తున్నాను. పంటను కోసి కూకట్‌పల్లి రైతు బజార్‌లో అమ్ముతున్నాను. కుటుంబ సభ్యులతో కలిసి చేసుకుంటే ఈ పంట మంచి ఫలితమే ఇస్తుంది. ఈ పంట వేసినప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు.

– వెంకటయ్య, రైతు, గొల్లగూడ

అట్రాసిటీ కేసుల నిర్వీర్యం తగదు

దళిత ప్రజా సంఘాల నాయకులు



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్ రూరల్: అట్రాసిటీ కేసులను నిర్వీర్యం చేయడం తగదని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో దళిత ప్రజా సంఘాల నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దుద్యాల, బొంరాస్‌పేట మండలాల్లోని గ్రామాల్లో దళితులపై దాడులు చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు చేసే అగ్రకుల పెత్తందార్లను వెంటనే అరెస్టు చేయాలని లేనిచో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బుస్స చంద్రయ్య, యూ రమేష్‌బాబు, అన్నారం సాయిలు, శివకుమార్, దశరథ్, సాయిలు, పకీరప్ప, ఆనంద్, శేఖర్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ఎంపీ డీకే అరుణను కోరిన బీజేపీ నాయకులు



డీకే అరుణకు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

దుద్యాల్: మండల అభివృధికి నిధులు మంజూరు చేయాలని మహబుబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను దుద్యాల్ మండల బీజేపీ నాయకులు కోరారు. ఆదివారం మహబుబ్‌నగర్ జిల్లా కార్యాలయంలో ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని ఎంపీ దృష్టికి తెచ్చారు. సీసీ రోడ్లు లేక గ్రామాల్లో వర్షం నీరు, మురుగు రోడ్లపై చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఎంపీ ప్రత్యేక నిధులతో పాఠశాల భవన నిర్మాణాల మంజూరునకు సహకరించాలని డీకే అరుణను కోరారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించి త్వరలోనే మండల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీకాంత్, హకీంపేట్ గ్రామ అధ్యక్షుడు శివకుమార్, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

కుల్కచర్ల: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..7 నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. కార్మికులు తమ బంగారాన్ని తాకట్టుపెట్టి మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన సీఐటీయూ మండల అధ్యక్షురాలుగా లక్ష్మి, కార్యదర్శులుగా మంజుల, నాగమ్మ, శాంతమ్మ, పరమేశ్వరి, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్



నాగర్‌గూడ చౌరస్తా వద్ద సీఐటీయూ జెండా ఎగురవేస్తున్న నాయకులు

షాబాద్: కార్మికుల హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తాలో సీఐటీయూ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీఐటీయూ సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. ముఖ్యంగా మండల పరిధిలోని చందనవెళ్లి పారిశ్రామిక ప్రాంతంలో కంపెనీ కార్మికులకు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వలస కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని.. అయినప్పటికీ కార్మిక శాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కార్మికులకు ఏ సమస్య ఉన్నా సీఐటీయూ ముందుండి ఆ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సీహెచ్ భీమయ్య, నాయకులు వడ్డే అంజయ్య, బాల్‌రాజ్, మానయ్య, సాయిలు, నర్సింలు తదితరులు ఉన్నారు.

రేపు బీఆర్‌ఎస్ క్యాకర్తల సమావేశం

మొయినాబాద్: బీఆర్‌ఎస్ మండల కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మొయినాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 5న ఉదయం 10 గంటలకు మున్సిపాలిటీలోని పద్మావతి గార్డెన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, మున్సిపల్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భూసార పరీక్షలతో మేలు

- నేల స్వభావం, సారం తెలుసుకోవచ్చు
- పంట మార్పిడికి రైతులకు అవకాశం



బూల్కాపూర్‌లోలో మట్టి నమూనా సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

కొడంగల్ రూరల్: వ్యవసాయంలో భూసార పరీక్షలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. నేల స్వభావం, సారం, లవణ పరిమాణంతోపాటు సూక్ష్మ, స్థూల పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో, ఏఏ పంటలకు అనుకూలమో ఈ పరీక్షల ద్వారా తెలుస్తుంది. భూసార పరీక్షలు చేయించిన రైతులకు అందజేసే కార్డుపై పూర్తి వివరాలతోపాటు పంటలకు ఏ మోతాదులో ఎరువులు, మందులు వేయాలో సూచిస్తారు. ఒక్కసారి పరీక్షలు చేయించుకుంటే ఆ ఫలితాల ఆధారంగా రెండు, మూడేళ్ల పంటలను సాగుచేసుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నేల రకం, సాగునీటి వసతి, మిట్ట, పల్లం, సేద్య పద్ధతుల ఆధారంగా వేర్వేరు నమూనాలు సేకరిస్తారు. పొలమంతా ఒకే రకంగా ఉంటే 5ఎకరాల విస్తీర్ణానికి ఒకే మట్టి నమూనా తీస్తే సరిపోతుంది. మట్టి నమూనా తీసే ప్రదేశంలో నేలపై చెత్త, చెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పారతో ఇంగ్లీష్ అక్షరం వి ఆకారంలో 15నుంచి24 సెంటీమీటర్ల గుంత తవ్వి, పైనుంచి దిగువకు ఒకే మంద పలుచని పొర వచ్చేలా మట్టి తీయాలి. ఇలా ఒకటి నుంచి 12 చోట్ల మట్టిని సేకరించాలి. అలా సేకరించిన మట్టిని గొనె పట్టా లేదా పాలిథిన్ కవర్ లేదా వస్త్రంపై పోసి పౌడర్ మాదిరిగా చేస్తూ మట్టిని చతురస్రాకారంగా పరచాలి. నాలుగు భాగాలు విభజిస్తూ ఇదే విధంగా నాలుగైదు పర్యాయాలు చేసిన అనంతరం ఇందులోంచి 500గ్రాముల మట్టి నమూనాను ప్లాస్టిక్ సంచిలో నింపిదాంతోపాటు నమూనా వివరాలను పరీక్షా కేంద్రానికి పంపనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే కొడంగల్ మండలానికి రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ యోజన పథకం కింద 550 మట్టి నమూనా పరీక్షలు చేసుకునేందుకు వీలు కల్పించినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలంలోని పర్సాపూర్ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో 125మట్టి నమూనాలు, కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని కొండారెడ్డిపల్లి, బూల్కాపూర్, ఐనన్‌పల్లి, పాతకొడంగల్ గ్రామాల్లో 425మట్టి నమూనాలు సేకరించనున్నారు. మట్టి నమూనాల పరీక్ష ఫలితాలతో రైతులకు మట్టిలో పోషకాహార స్థాయి, సేంద్రియ పదార్థాల శాతం వంటి కీలక సమాచారంతో భూసార పరీక్షల అనంతరం కార్డులు అందజేస్తారు. ఈ కార్డుల్లో భూమి ఉత్పాదకత పెంపు, రసాయన ఎరువుల సమర్థవంతమైన వినియోగం, పంటలకు సరిపోయే మోతాదును వివరించే సమాచారం ఉంటుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతుల పొలాల దగ్గరకు భూసార పరీక్షల నిమిత్తం మట్టిని సేకరించేందుకు వెళ్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మట్టి నమూనాలు అందించేందుకు కృషిచేయాలి. భూసార ఫలితాలకు అనుగుణంగా పంటలను సాగు చేసుచేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చు.

– జి.తులసి, మండల వ్యవసాయాధికారి, కొడంగల్

కరాటేలో శిక్షణ.. బాలికలకు రక్షణ!



కర్ర సాధన చేస్తున్న విద్యార్థినులు

- ఆత్మ విశ్వాసమే ఆయుధంగా ముందుకు..
- కరాటేలో రాణిస్తున్న గురుకుల విద్యార్థినులు

షాద్‌నగర్: నిత్యం ఎక్కడో ఒక చోట బాలికలు, యువతులు, మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఆడపడుచుల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. వారు బయటికి వెళ్లి ఇంటికి క్షేమంగా తిరిగివస్తారన్న నమ్మకం లేదు. అడుగడుగునా ఆకతాయిల వేధింపులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు యుద్ధ విద్యల్లో రాణిస్తున్నారు.

విద్యార్థినుల ప్రతిభ

షాద్‌నగర్ పట్టణ శివారులో ఉన్న నూర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన బాలికల గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు, అదేవిధంగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో ఉన్న బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు తెలంగాణ రాష్ట్ర పాఠశాలల, క్రీడల అసోసియేషన్, జపాన్ కరాటే అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ పొందుతున్నారు. ఈ కళాశాల విద్యార్థినులు ఇటీవల ఘట్‌కేసరి, ఎల్‌బీ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో రాణించి పతకాలు సాధించారు. తాజాగా షాద్‌నగర్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు గీత, ఐశ్వర్యలు రాణించి వెండి, రజిత పతకాలను సాధించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

సమాజంలో ఉండే కొందరు వ్యక్తులు మహిళలు, యువతులపై వేధింపులకు గురి చేస్తుంటారు. ఇంట్లో నుంచి ఒంటరిగా బయటికి వచ్చిన వారిని వేధించి అఘాయిత్యాలకు పాల్పడుతుంటారు. అయితే యువతులు ఇంట్లో నుంచి బయటికి వస్తున్నారంటే చాలు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నాం, ఎక్కడ ఉన్నామన్న విషయాన్ని తల్లిదండ్రులకు వివరించాలి. ఏవైనా అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.


ఆత్మరక్షణకు ఉపయోగపడుతుంది



ఆపదలో ఎదుటి వారి నుంచి ఆత్మ రక్షణ పొందేందుకు కరాటే ఎంతో ఉపయోగపడుతుంది. కళాశాలలో ప్రతి రోజు కరాటే సాధన చేస్తున్నాను. వివిధ టోర్నమెంట్‌లలో పాల్గొని పతకాలు సాధించాను.

– కోట ఐశ్వర్య, గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని, షాద్‌నగర్

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



యుద్ధ విద్యలు నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రతి రోజు కొంత సమయాన్ని కరాటే నేర్చుకునేందుకు కేటాయిస్తున్నాను. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు.

– విస్లావత్ గీత, గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని, షాద్‌నగర్

పాఠ్యాంశంలో చేర్చాలి



చిన్నతనం నుంచే యుద్ధ విద్యలో ప్రావీణ్యం పొందాలంటే కరాటేను విధిగా ప్రభుత్వం పాఠ్యాంశాల్లో చేర్చాలి. అయితే ఏడాది పొడవునా శిక్షణా తరగతులు నిర్వహిస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఎత్తిన చెన్నయ్య, కరాటే మాస్టర్

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనిల్



నియామకపత్రం అందజేస్తున్న అనిల్ తదితరులు

బంట్వారం: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్‌ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ అన్నారు. ఆదివారం కోట్‌పల్లి మండలంలోని బీరోల్, బార్వాద్ తండా గ్రామాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అనిల్ మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఆనందం (బీరోల్), ప్రేమ్ (బార్వాద్ తండా) నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, యూత్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య

షాద్‌నగర్: విద్యలో రాణించడం ద్వారా సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామానికి చెందిన సంగెం ప్రభాకర్ ప్రమోటర్ మోటివ్ ఎనాలిసిస్ ఆఫ్ జీఎస్‌ఆర్‌హెచ్ 1 ఇన్ బోనిఫిషెస్ అనే అంశంపై పరిశోధన జరిపిన గ్రంథాన్ని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం బాబయ్య దూసకల్ గ్రామానికి వెళ్లి సంగెం ప్రభాకర్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యలో రాణించిన వారికి సమాజంలో ప్రత్యేక స్థానం లభిస్తుందన్నారు. కృషి, పట్టుదల ఉంటే కానిది అసాధ్యమన్నారు. సంగెం ప్రభాకర్ పరిశోధన గ్రంథాన్ని యూనివర్సిటీకి అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు